క్లుప్తంగా

మద్దతు ధర చెల్లించాలి

చెన్నారావుపేట : యాసంగిలో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలకు మద్దతు ధర రూ.2,500 చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మొక్కజొన్న, వరికి మద్దతు ధర రూ. 2,500 చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రూ.2,000 ఉంటే రూ.1,800కే కొనుగోలు చేస్తున్నారని, ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకుంటున్నామని చెప్పడమే కాకుండా మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

డోర్నకల్ ఇన్‌చార్జ్‌గా రంజిత్‌రెడ్డి



నెక్కొండ : నర్సంపేట టీపీసీసీ సభ్యుడు, నెక్కొండ మండలానికి చెందిన సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డిని డోర్నకల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ మేరకు మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్(ఎల్‌డీఎం)లో భాగంగా ఎస్టీ అసెంబ్లీ నియోజక వర్గాలకు పార్టీ ఇన్‌చార్జ్‌లను ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ శివాజీరావ్ మొఘే నియామక ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అందులో భాగంగా ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి ఆశీస్సులతో డోర్నకల్ ఇన్‌చార్జ్‌గా నియమించారని ఆయన పేర్కొన్నారు. దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, పార్టీ బలోపేతానికి పాటుపడుతానన్నారు. తన నియామకానికి సహకరించిన ముఖ్య నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు రంజిత్‌రెడ్డిని అభినందించారు.

సామగ్రి బహూకరణ



దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ. లక్ష విలువగల డెస్క్ బెంచీలు, ల్యాబ్ టేబుల్ జిరాక్స్ మిషన్, స్కానర్‌ను శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు శ్రీనివాస్, శ్రీనాథ్, వీరేశం, రమేష్, హెచ్‌ఎం స్వామి, సర్పంచ్ మోడెం విద్యాసాగర్, ఎంపీటీసీ మాలోత్ చంద్రు విద్యాకమిటీ చైర్మన్ చుక్క శివాజీ, ఉపాధ్యాయులు శ్రీవాణి, మొగిలి, రమేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన ఎండీ ఖాజాపాషా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కాగా రంజాన్ పండుగ సందర్భంగా నేతాజీ సర్వీస్ బృందం సభ్యులు శనివారం రూ.3వేల సాయం అందించారు. మొగసాని శంకర్, సభ్యులు బరుపటి అనిల్, చెల్పూరి హరీష్, శేఖర్, గురు, నాగరాజు ఉన్నారు.

అంత్యక్రియల కోసం..

గీసుకొండ మండల కేంద్రానికి చెందిన కోట సారయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా అంత్యక్రియల కోసం స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.5 వేల సాయం చేశారు. శనివారం సర్పంచ్ దౌడు బాబు, కోట ప్రమోద్, రాంమూర్తి కుటుంబ సభ్యులకు సాయం అందించారు.

గుడుంబా స్వాధీనం

గీసుకొండ : జాన్‌పాకలోని సునీత అనే మహిళ నుంచి 54లీటర్ల గుడుంబా ప్యాకెట్లను యాకూబ్‌పాషా అనే వ్యక్తి కొనుగోలు చేసి మంగలి తండాలో అధిక ధరకు అమ్మకానికి తీసుకుని వెళ్తుండగా శనివారం వాహనాల తనిఖీలో పట్టుబడ్డాడని పోలీసులు తెలిపారు. తదుపరి చర్యల కోసం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓకు నివేదించినట్లు ఎస్సై సందీప్‌కుమార్ పేర్కొన్నారు.

జీవ వైవిధ్య శిక్షణకు ఉపసర్పంచ్

వరంగల్(పర్వతగిరి) : జీవ వైవిధ్య నిర్వహణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన శిక్షణ తరగతులకు మండలంలోని తూర్పుతండా ఉపసర్పంచ్ బానోత్ యుగంధర్ వెళ్లారు. ఈ సందర్భంగా జీవ వైవిధ్య చట్టం-2002అమలుపై జీవ వైవిధ్య నిర్మాణ కమిటీ ప్రతినిధులకు సామర్థ్యం పెంపు కోసం జంతువుల సంరక్షణ, అడవుల అభివృద్ధి, చెరువు రక్షణ, భూగర్భ జలాలను ఎలా కాపాడుకోవాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం బీఎంసీ సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు.

హనుమాన్ దీక్ష పూజలు

సంగెం : మండలంలోని కుంటపల్లిలో హనుమాన్ దీక్ష స్వాములు శనివారం పూజలు నిర్వహించారు. కుంటపల్లి చెరువు వద్ద హనుమాన్ ఆలయ నిర్మాణం ప్రారంభించామని త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు మైదంశెట్టి కోటేశ్వర్, సూరయ్య, సారయ్య, రాజు, రమేష్, వరదరాజులు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సంగెం: చింతలపల్లిలో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ముస్లింలు



వర్ధన్నపేట: అన్వర్ కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే అరూరి రమేశ్



నెక్కొండ: మాట్లాడుతున్న మత పెద్ద



సంగెం: గవిచర్ల ఈద్గా వద్ద..



ఘనంగా రంజాన్ వేడుకలు



గీసుకొండ: జాన్‌పాక ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



సంగెం: చిన్నారుల అలయ్‌బలయ్

జిల్లావ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మసీదుల్లో, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలకు ముగింపుగా శనివారం రంజాన్ పండుగను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్న, పెద్ద తేడా లేకుండా అలయ్‌బలయ్ చెబుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. అనంతరం పాయసం పంచిపెట్టారు. ఆయా కార్యక్రమాల్లో కోఆప్షన్ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దుగ్గొండి: మసీదులో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



రాయపర్తి: మాట్లాడుతున్న ఉషాదయాకర్‌రావు



సంగెం: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి



ఖానాపురంలో..



ఖానాపురం: వేడుకలో పాల్గొన్న ముస్లింలు



చెన్నారావుపేట: నమాజ్ చేస్తున్న ముస్లింలు



నెక్కొండ: ఈద్గా వద్ద అలయ్‌బలయ్



నల్లబెల్లి: శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్



పర్వతగిరి ఈద్గా వద్ద..

ప్లీనరీని విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : ద్వారకపేటలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో ఈనెల 25న నిర్వహించ తలపెట్టిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజవకర్గ ప్లీనరీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్లీనరీలో క్రియాశీల కార్యకర్తలకు అవకాశం కల్పించాలని, నియోజకవర్గ ప్లీనరీకి నిర్ణయించిన కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులతో నిర్వహించబడుతుందన్నారు. మండలానికి 800మంది చొప్పున 6వేల మందితో ప్లీనరీ నిర్వహిస్తామన్నారు. 25వ తేదీన ఉదయం 8గంటలకు ప్రతీ గ్రామంలో జెండా పండుగ నిర్వహించి సమావేశానికి బయలుదేరాలని సూచించారు. ప్లీనరీలో పార్టీ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులపై చర్చించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు సాధించిన విజయాలు, నియోజకవర్గ, రాష్ట్ర, జాతీయ రాజకీయాలకు సంబంధించిన తీర్మానాలు ఈ ప్లీనరీలో ఉంటాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయి ప్లీనరీకి రెండు రోజుల సమయం ఉన్నందున ప్రతీ గ్రామంలో సమావేశాలు నిర్వహించి కార్యకర్తలను ఆహ్వానించాలన్నారు. అన్ని సామాజిక వర్గాలను ప్లీనరీలో భాగస్వామ్యం చేయాలన్నారు. రైతులకు పరిహారం అందజేసిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాద తీర్మానం, డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో తీర్మానాలు ఉంటాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణం గురించి గ్రామాల వారిగా సభలు నిర్వహించి ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్లీనరీ సాక్షిగా తీర్మానం చేద్దామన్నారు. నియోజకవర్గానికి సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై కేంద్ర ప్రభుత్వ వైఖరి, ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకునేందుకు ప్రత్యేక తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతీ గ్రామానికి నిధులు వచ్చాయని, ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న 172కిలో మీటర్ల తారురోడ్డు, 152కిలో మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు మూడు నెలల్లో పూర్తి అవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామినాయక్, పట్టణ, మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునే ఆర్థికస్తోమత లేని ఎంతో మంది పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎనిమిది మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వర్తించని ఎన్నో రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు.

వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

వరంగల్ (పర్వతగిరి) : విద్యుత్ షాక్‌కు గురై రెండు కాళ్లు కోల్పోయి మృతి చెందిన భూక్యా వెంకటేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బిదాసి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని అన్నారంలో అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని టేకులపల్లి మండలం ముత్యాలపాడు గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ భూక్యా వెంకటేష్ రైతు వేదిక వద్ద స్తంభం ఎక్కి విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో షాక్‌కు గురై కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడని తెలిపారు. దీంతో నాలుగు రోజులుగా ఉస్మానియా ఆసత్పిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడని తెలిపారు. స్థానిక ఎంపీడీఓ, సర్పంచ్, లైన్‌మన్ ఒత్తిడి వల్ల స్తంభం ఎక్కి కింద పడడంతో రెండు కాళ్లు కోల్పోయి మృతి చెందాడన్నారు. వెంకటేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొమ్మటి వెంకన్న, ఒగ్గు యాకయ్య, జి.మహేందర్, వి.మంజుల, సీహెచ్.వెంకన్న, వెంకటస్వామి, ఎల్లయ్య, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ



రైతులకు చెక్కు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

దుగ్గొండి : గతేడాది వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంట నష్టపరిహారం చెక్కులను సర్పంచ్ మోడెం విద్యాసాగర్ శనివారం రైతులకు అందజేశారు. గ్రామంలోని 640మంది రైతులకు రూ.48లక్షల పరిహారం మంజూరైంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు.కార్యక్రమంలో ఏఓ దయాకర్, ఎంపీటీసీ మాలోత్ చంద్రు, ఏఈఓ రాజేష్, దొనపాటి జనార్దన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తోటకూరి శ్రీనివాస్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, కిరణ్, వేణు పాల్గొన్నారు.

భూ తగాదాలో ఇరువురిపై కేసు నమోదు

చెన్నారావుపేట : భూ తగాదా విషయంలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట మహేందర్ తెలిపారు. నెక్కొండ మండలంలోని చిన్న కోర్పోలు గ్రామానికి చెందిన పులి రంజిత్, బొడ్డుపల్లి యాకయ్యలకు సూరిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ భూములు ఉన్నాయి. భూమి విషయంలో ఒకరిపై ఒకరు ఈనెల 19న(బుధవారం) పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాల వారికి గాయాలయ్యాయి. ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అనంతరం ఇరువురి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శనివారం తెలిపారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

రాయపర్తి : వేసవి తాపానికి గురవుతున్న ప్రజలకు దాహార్తి తీర్చడం అభినందనీయమని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని తిర్మలాయపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థానిక సర్పంచ్ గజవెల్లి అనంత ప్రసాద్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రోజురోజుకీ మండుతున్న ఎండలకు జీవకోటికి నీరే ప్రాణాధారం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నల్లతీగల సంతోష్, సిబ్బంది కారోబార్ మహంకాళి రత్నాకర్, కొంగ్రా రాములు, కుక్కల యాకయ్య, అన్నెపు వెంకన్న, గజవెల్లి సోమయ్య, పల్లె యాకయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ వేడుకలు



నర్సంపేట: ఆవిర్భావ వేడుకల సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న రాజేందర్



చెన్నారావుపేటలో..

నర్సంపేట : సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. 1969 ఏప్రిల్ 22న నయా రివిజనిజానికి స్వస్తి చెప్పి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీగా ఆవిర్భవించి నేటికి 54సంవత్సరాలు అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు విప్లవ పార్టీలు ఇంకా సజీవంగానే ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు గట్టి కృష్ణ, ఆకుల వెంకటస్వామి, సుమన్, గుర్రం అజయ్, పాణి, ఐలన్న, చైతన్య, ఝాన్సీ, సంధ్య, పూలక్క, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : సీపీఐ (ఎంఎల్) 54వ ఆవిర్భావ వేడుకలను మండలంలోని ఉప్పరపల్లి, లింగాపురం, కోనాపురం గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్కొండ-చెన్నారావుపేట మండలాల కార్యదర్శి అడ్డూరి రాజు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మండల నాయకుడు జవహర్‌లాల్, ఆర్స్ వెంకన్న, సీహెచ్ కుమారస్వామి, కర్ణాకర్, లక్ష్మణ్, రవి, నరేష్, తేజ, తదితరులు ఉన్నారు.

హనుమాన్ దీక్షతో ఆధ్యాత్మికత



పూజలు చేస్తున్న హనుమాన్ దీక్షపరులు

నెక్కొండ : వయస్సుతో సంబంధం లేకుండా చిన్నారుల నుంచి పెద్దల వరకు హనుమాన్ దీక్ష తీసుకొని ఆధ్యాత్మిక బాటలో పయనిస్తున్నారు. మండలవాసులు వ్యసనాలకు దూరంగా ఉండి, భక్తిభావం పెంపొందించుకుంటున్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా గ్రామాలు, శివారులు గిరిజన తండాల్లో పలువురు హనుమాన్ దీక్షను స్వీకరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికంగా ఉండే హనుమాన్ దేవాలయాల్లో మండలవాసులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నెక్కొండ మండల కేంద్రంలోని పంచముఖాంజనేయ స్వామి ఆలయంలో శనివారం కొందరు దీక్షలు స్వీకరించారు. అనంతరం ఆలయకమిటీ చైర్మన్ ఎర్రబెల్లి సంపత్‌రావు హనుమాన్ దీక్ష స్వాములకు అన్నదానం నిర్వహించారు.

ఆధ్యాత్మిక వాతావరణంలో గ్రామాలు..

మండల కేంద్రంతోపాటు రెడ్లవాడ, గొట్లకొండ, సూరిపెల్లి, పెద్దకొర్పోలు, చింతనెక్కొండ తదితర గ్రామాల శివారు తండావాసులు సుమారు 30నుంచి 40 మంది వరకు ఈ హనుమాన్ దీక్షను శనివారం స్వీకరించారు. మొత్తంగా సుమారు 300మంది వరకు ఉన్న దీక్షపరులతో ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఆసక్తి చూపుతున్న చిన్నారులు..

ఆధ్యాత్మిక బాటను ఎంచుకొని చాలా మంది చిన్నారులు హనుమాన్ దీక్షలను స్వీకరిస్తున్నారు. అందులో భాగంగా నియమ, నిష్టలతో ఉపవాస దీక్షలను ఆచరించడంతో పాటు భజన, కీర్తనలతో ఆంజనేయుడిని నిత్యం ఆరాధిస్తున్నారు. ఈ దీక్షలు తమలో ఆధ్యాత్మిక భావంతోపాటు ప్రశాంతతను కలిగిస్తాయని వారు పేర్కొంటున్నారు. దీంతోపాటు నిత్యం జై శ్రీరాం, జై హనుమాన్ అంటూ నిత్యం నామస్మరణలు చేస్తు ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

దీక్షతో ఆరోగ్యంగా..



16 ఏళ్లుగా హనుమాన్ దీక్ష తీసుకుంటున్నా దీంతో ఆరోగ్యంగా ఉండడంతోపాటు క్రమశిక్షణ తెలిసివచ్చింది. మనసు సైతం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. చెడు వ్యసనాల భారిన పడకుండా ఈ దీక్ష ఎంతో దోహదపడుతున్నాయి. మంచి అలవాట్లకు దారితీస్తున్నాయి.

–కోల ప్రవీణ్‌గౌడ్, గురుస్వామి, దీక్షకుంట

చదువుపై ఏకాగ్రత, క్రమశిక్షణ



హనుమాన్ దీక్షను తీసుకోవడంతో ఏకాగ్రత, శ్రద్ధ కలుగుతోంది. తెల్లవారుజామున నిద్రలేవడం, స్నానాలు చేయడం వంటివి అలవాటయ్యాయి. భక్తి శ్రద్ధలతో హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నా.. నిత్యం హనుమాన్ నామస్మరణలోనే ఉంటున్నాం.

–గుగులోత్ అరవింద్, కన్నె స్వామి, రెడ్లవాడ

నల్లబెల్లిలో వ్యక్తి అదృశ్యం



దుంబారు బిందని

నల్లబెల్లి : వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై సురేష్ నాయక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోవిందాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శంషాబాద్ గ్రామ శివారులో రమణారెడ్డి కోళ్ల ఫాం షెడ్‌ను నిర్మిస్తున్నాడు. అయితే ఈ నిర్మాణ పనులకు ఒడిశా రాష్ట్రంలోని నాబారంగాపూర్ జిల్లా, డబుగన్ మండలంలోని కారాగాన్‌కు చెందిన 8మంది వచ్చి, పనిచేసుకుంటూ రెండునెలలుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఈనెల 17న ఉదయం వీళ్లలో ఒకరైన దుంబారు బిందని(33)బియ్యం తీసుకొస్తానని శంషాబాద్ గ్రామంలోకి వెళ్లాడు. కానీ తిరిగిరాలేదు. దీంతో గ్రామంలో, చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో, ఒడిశాలో వెతికిన ఆచూకి లభించలేదు. దీంతో సూత్రం లోహారా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.